## క్లుప్తంగా

### దరఖాస్తుల ఆహ్వానం

**ఆమదాలవలస:** పారాలీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్థానిక సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసైన ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు, వయోవృద్ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘ సభ్యులు సేవాదృక్పథం కలిగినవారు ఎవరైనా వలంటీర్‌గా వ్యవహరించవచ్చునన్నారు. అటువంటి అర్హతకలిగిన వారు దరఖాస్తుతో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 7వ తేదీ లోగా మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయానికి అందజేయాలని తెలిపారు. ఈ వలంటీర్లకు ఎటువంటి జీత, భత్యాలు ఉండవని స్పష్టం చేశారు.

### నేడు మండల సమావేశం

**నరసన్నపేట:** మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహించనున్నామని ఎంపీడీఓ మధుసూదనరావు గురువారం తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళి అధ్యక్షత వహిస్తారన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.

### రగ్గులు, సరుకుల పంపిణీ

**నరసన్నపేట:** స్థానిక వీరన్నాయుడు కాలనీలో లెప్రసీ, కేర్ సెంటర్‌లో ఉన్న 35 మందికి రగ్గులు, నిత్యావసర సరుకులను నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి చేతుల మీదుగా పంపిణీ చేసినట్లు బ్రైట్ ఫ్యూచర్ సంస్థ కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు. స్థానిక సీఎంఆర్ షోరూం వారు వీటిని వితరణ చేశారన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ మేనేజర్ ఎస్.కె.జాన్.బాషా, బ్రైట్ ఫ్యూచర్ ప్రతినిధి ఎలీసా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మెళియాపుట్టి:** స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టెక్కలి ఈఈ శంకరరావు గురువారం తెలిపారు. 33 కేవీ ఫీడర్ మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చాపర, మెళియాపుట్టి, బందపల్లి, పెద్దపద్మాపురం, వసుంధర, కొసమాల, జాడుపల్లి, మాకనాపల్లి, పట్టుపురం, పద్మ, సిరియాఖండి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

**పాతపట్నం మండలంలో..**

**పాతపట్నం:** స్థానిక 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్‌శాఖ టెక్కలి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.శంకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతపట్నం, బూరగాం, గురండి, సరాలి, బోరుభద్ర, బగడల, కాపు గోపాలపురం, హరిజన గోపాలపురం, సీతారాంపల్లి, తిడ్డిమి, రంకిణి, దాసుపురం, సూర్యనారాయణపురం తదతర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.


### స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తాం



పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

**సరుబుజ్జిలి:** ఆమదాలవలస మున్సిపాలిటీ ప్రజలకు నాణ్యతమైన తాగునీటిని అందించేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వెల్లడించారు. అలమాజీపేట వద్ద గల మున్సిపాలిటీ వాటర్ సప్లయ్ పంపుహౌస్ పనితీరును గురువారం పరిశీలించారు. అదనంగా వాటర్ ఫిల్టరేషన్ బావులు, మోటార్లు కొత్తగా ఏర్పాటుచేసి తాగునీటికి ఆటంకం లేకుండా పంపిణీ చేస్తామన్నారు. మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### రుణాలపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న వెలుగు సిబ్బంది, వీఓఏలు

**కొత్తూరు:** విశ్వకర్మ, ముద్ర, స్వయం సిద్ధ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఓ జనార్దనరావు వెలుగు సిబ్బంది, వీఓఏలకు సూచించారు. రుణాలు మంజూరు కోసం అవసరమైన నియమాలను వివరించాలన్నారు. ఇంతవరకు మహిళ సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలు రికవరీపై దృష్టి సారించాలన్నారు. ప్రతీ ఎస్‌హెచ్‌జీ గ్రేడ్–ఏ ఉండేలా పని చేయాలన్నారు. హౌస్ హోల్డ్ సర్వే మూడు రోజుల్లో పూర్తిచేయాలన్నారు. సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతమయ్యేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు రవ్వల జయమ్మ, కార్యదర్శి గొర్జాన సుదీష్ణ, సీసీలు జ్యోతి, చంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఎక్కడ చెత్త అక్కడే



ఈ చిత్రం నరసన్నపేట మేజరు పంచాయతీ పాతబస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వరాలయం వద్ద కనిపింది. నరసన్నపేటలో వీధుల్లో చెత్త పేరుకు పోతుంది. ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంటుంది. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి. మారుతీనగర్, నేతాజీ వీధి, కోవెల వీధి, వీరన్నాయుడు కాలనీ, పాతబస్టాండ్‌తోపాటు పలు వీధుల్లో చెత్త పేరుకుపోయింది. పంచాయతీ సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. నరసన్నపేటకు చెందిన పారిశుద్ధ్య కార్మికులను కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి ఉత్సవాలకు తరలించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

– నరసన్నపేట

### 180 మందికి వైద్య పరీక్షలు



పొందూరు మండలం గోరింట గ్రామంలో ఏపీ శాక్స్ సహకారంతో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సలహా మేరకు గురువారం మెడికవర్ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జ్వరం, కీళ్లనొప్పులు, బీపీ, సుగర్ తదితర వ్యాధి గ్రస్తులు సుమారు 180 మందికి వైద్య సేవలందించి మందులను అందజేశారు. వైద్యులు కోటి, సూర్య, జిల్లా రీసోర్స్‌పర్సన్ హనుమంతు నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

– పొందూరు

### ఉల్లాసంగా.. ఉత్సాహంగా




పాతపట్నం కోర్టు కూడలి సమీపంలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు సందడిగా జరిగాయి. డైరెక్టర్ ఎస్.మధుబాబు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని విద్యార్థులకు సూచించారు. విద్యాతోపాటు అన్ని రంగాల్లోనూ రాణించాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు సంస్కృతిక ప్రదర్శనలతోపాటు నృత్యాలు చేశారు. ప్రిన్సిపాల్ అంజనేయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

– పాతపట్నం



సారవకోట: అవలింగిలోని నీలమణి అమ్మవారి ఆలయంలో ప్రారంభమైన శరన్నవరాత్రులు



సారవకోట: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



నరసన్నపేట: ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న కార్ స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు



నరసన్నపేట: వీఎన్‌పురంలో ఏర్పాటు చేసిన దేవీ విగ్రహాలు

## జయహో దుర్గాభవానీ..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. పలు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో దుర్గాదేవి విగ్రహాలను కొలువుదీర్చారు. ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



పాతపట్నం: బాలత్రిపుర సుందరిగా నీలమణిదుర్గ



హిరమండలం: సుభలయలో దేవి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



హిరమండలం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ యాగం నిర్వహిస్తున్న దృశ్యం



నరసన్నపేట: మాకివలసలో దుర్గాదేవి విగ్రహానికి పూజలు చేస్తున్న భవానీలు



నరసన్నపేట: ఉర్లాంలో దుర్గాదేవికి హారతి ఇస్తున్న అర్చకులు, పూజలు చేస్తున్న భక్తులు



పాతపట్నం: నీలమణిదుర్గ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



పొందూరు: రాపాకలో పూజలందుకుంటున్న దుర్గాదేవి విగ్రహం

## గ్రామాభివృద్ధికి సహకరించాలి

**ఆమదాలవలస:** గ్రామాభివద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తొగారం సర్పంచ్ తమ్మినేని వాణి సీతారాం అన్నారు. గురువారం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడారు. స్థానిక సుపరిపాలన ద్వారా గ్రామాభివృద్ధి సాధ్యమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఈ సంవత్సరంలో చేయాల్సిన పనులను గుర్తించి ప్రణాళిక వేయాలన్నారు. అధికారులు, తమ్మినేని వేణు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




ఆమదాలవలస: మాట్లాడుతున్న సర్పంచ్ తమ్మినేని వాణీసీతారాం

**నరసన్నపేట:** మేజరు పంచాయతీ నరసన్నపేటలో ప్రభుత్వ పథకాలన్నీ అర్హులకు రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలని సర్పంచ్ బూరల్లి శంకర్, వార్డు సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, కృష్ణ ప్రసాద్, బీఎల్ శర్మ, ఇప్పిలి నీలం కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం గ్రామ సభ నిర్వహించారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఖర్చులు, ఆదాయాన్ని చదివి వినిపించారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష చేశారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, ఈఓ ద్రాక్షయిని, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పీస కృష్ణ, జామి వెంకటరావు పాల్గొన్నారు.

**సరుబుజ్జిలి:** ప్రజలకు ఉపయోగపడేలా ఉపాధి పనులు చేయాలని పురుషోత్తపురం పంచాయతీ ఉపసర్పంచ్ పైడి నరిసంహప్పారావు తెలిపారు. స్థానిక సచివాలయంలో గురువారం లేబర్ బడ్జెట్‌పై గ్రామసభ నిర్వహించారు. పంచాయతీలో మౌలిక వసతుల కల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. పంచాయతీ కార్యదర్శి అప్పలనాయుడు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## మహా ధర్నాను జయప్రదం చేయాలి

**కొత్తూరు:** ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 4న శ్రీకాకుళం డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద నిర్వహించనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని ఆశ వర్కర్ల మండల సంఘం (సీఐటీయూ) నాయకులు కోరారు. మండలంలోని కురిగాం, మెట్టూరు పీహెచ్‌సీలకు చెందిన వైద్యాధికారులు పి.ప్రశన్న, తేజేశ్వరికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వేతనాలు పెంచాలని, గ్రూప్ ఇన్సురెన్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, మెటర్నరీ సెలువులు మంజూరు చేయడంతోపాటు అన్ని రకాల సంక్షేమ పథకాలు అందజేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు పద్మశ్రీ, సుశీలమ్మ, శ్రీలత, నిర్మల, లక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు



కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

## విద్యార్థినికి అభినందన

**పాతపట్నం:** విద్యార్థులు ఉన్నత చదువుతు చదివి పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని పాతపట్నం ప్రభుత్వ మోడల్ ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి అన్నారు. మండలంలోని తీమర గ్రామానికి చెందిన బండి గౌతమి.. పాతపట్నం ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో బైపీసీ చదివింది. ఇటీవల నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 1,125 ర్యాంకు సాధించి మెడిసిన్‌లో సీటు పొందింది. గురువారం మోడల్ స్కూల్‌లో గౌతమిని, తల్లి భారతిని ప్రిన్సిపాల్, అధ్యాపకులు సత్కరించారు. విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



గౌతమిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ రత్నకుమారి, అధ్యాపకులు

## ఆయాను తొలగించలేదు

**సరుబుజ్జిలి:** పెద్దవెంకటాపురం పాఠశాలలోని మరుగుదొడ్డి క్లీనర్ (ఆయా) పోస్టును తొలగించలేదని ఎంఈఓ–2 కె.శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆయాను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని పీఎంసీ చైర్‌పర్సన్ అల్లాడ తనూజ, తదితరులు ఆందోళన చేశారన్నారు. విద్యాశాఖ కార్యాలయ నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వివరణ ఇచ్చారు.

## టెట్ తొలిరోజు పరీక్ష ప్రశాంతం

**నరసన్నపేట:** స్థానిక కోర్ టెక్నాలజీలో టెట్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. నరసన్నపేట కేంద్రంలో ఉదయం, సాయంత్రం రెండు సెషన్లలో 660 మంది అభ్యర్థులకు కేటాయించగా 63 మంది గైర్హాజరయ్యారని సెంటర్ అధికారి, ఎంఈఓ దాలినాయుడు తెలిపారు. ఉదయం 330 మందికి 31 మంది, సాయంత్రం 330 మందికి 32 మంది గైర్హాజరయ్యారన్నారు.

### ప్రకృతి పంటలతో మేలు

**కొత్తూరు:** ప్రకృతి వ్యవసాయ సాగు విస్తీర్ణం పెంచేలా సిబ్బంది కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం రీజనల్ ఆఫీసర్ హేమ సుందరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై సంభోదిటీమ్ నమోదు చేసే వివరాలపై గురువారం సమావేశం ఏర్పాటు చేశారు. స్టేట్ టీమ్ సభ్యుడు గోవింద రెడ్డి ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అంతర పంటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలన్నారు. ఎస్ఎఫ్ఏ శివాజీ, ముసలయ్య మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న పంటలకు మార్కెట్‌లో విక్రయించేందుకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరుకు అవసరమైన నియమాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం అడిషినల్ డీపీఎం ధనుంజయ, ఎంటీ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

### ఆక్రమణలు తొలగించండి

**ఆమదాలవలస:** పట్టణంలోని డ్రైనేజీలపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశించారు. గురువారం 15వ వార్డు పరిధిలోని గణేష్‌నగర్, మోణింగివారి వీధుల్లో పర్యటించి పలు ప్రాంతాలను పరిశీలించారు. గణేష్‌నగర్‌లోని మురికి కాలువలను పరిశీలించి మున్సిపల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. పాత స్టేట్ బ్యాంక్ ప్రాంతంలో మురికి కాలువలపై ఏర్పాటు చేసిన దుకాణాలను ఆయన గుర్తించి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ మీద ఉన్న షాపులను తొలగించాలని ఆదేశించారు. మండలంలోని శ్రీరామవలస పంచాయతీ పరిధిలో ఏర్పాటు చేయనున్న కంప్రెసెడ్ బయోగ్యాస్ ప్లాంట్ (సి.బి.జి)కు ప్రభుత్వం కేటాయించిన ఐదు ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ పి.బాలాజీప్రసాద్ పాల్గొన్నారు.

## బాధ్యతల స్వీకరణ

**ఎల్.ఎన్.పేట:** స్థానిక తహసీల్దార్‌గా జె.ఈశ్వరమ్మ గురువారం విధుల్లోకి చేరారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వై.వి.పద్మావతి బూర్జ మండలానికి బదిలీపై వెళ్లారు. బూర్జ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఈశ్వరమ్మ ఎల్.ఎన్.పేటకు బదిలీపై వచ్చారు. తహసీల్దార్ ఈశ్వరమ్మకు ఉప తహసీల్దార్ రషీద్ ఆహ్మద్, ఆర్ఐ గవరయ్య, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.



తహసీల్దార్ ఈశ్వరమ్మ

**బూర్జ:** స్థానిక తహసీల్దార్‌గా వై.వి.పద్మావతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈమె ఇటీవల ఎల్.ఎన్ పేట తహసీల్దార్‌గా విధులు నిర్వహించి బదిలీపై బూర్జ వచ్చారు. బూర్జ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన జె.ఈశ్వరమ్మ బదిలీపై ఎల్.ఎన్ పేట మండలానికి వెళ్లారు. తహసీల్దార్ పద్మావతికి డీటీ బి.సంతోష్‌కుమార్, ఆర్ఐ ఎస్.వెంకటరావు, ఆర్వోలు, సిబ్బంది స్వాగతం పలికారు.



తహసీల్దార్ పద్మావతి

**హిరమండలం:** స్థానిక తహసీల్దార్‌గా కె.రవిచంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ వెంకటరమణ అనకాపల్లి జిల్లా రాయవరం తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లారు. తహసీల్దార్ రవిచంద్రను ఉప తహసీల్దార్ వెంకటమరణ, ఆర్ఐ, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది అభినందనలు తెలిపారు.



హిరమండలం: తహసీల్దార్‌కు అభినందనలు తెలుపుతున్న రెవెన్యూ సిబ్బంది

### విధుల్లో చేరిన ఎంపీడీఓలు

**ఎల్.ఎన్.పేట:** స్థానిక ఎంపీడీఓగా పి.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్ బదిలీపై హిరమండలం మండలానికి వెళ్లారు. విజయనగరం జిల్లాలో పనిచేసిన ఎంపీడీఓ శ్రీనివాసరావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.



ఎంపీడీఓ శ్రీనివాసరావు

**కొత్తూరు:** స్థానిక ఎంపీడీఓగా వి.నిరజ గురువారం బాధ్యతలు చేపట్టారు. కంచిలి ఎంపీడీఓగా నీరజ ఇంతవరకు పనిచేశారు. కొత్తూరులో పనిచేసిన పావని సరుబుజ్జిలి ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు.

**సరుబుజ్జిలి:** స్థానిక ఎంపీడీఓగా ఎం.పావని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో కొత్తూరు ఎంపీడీఓగా పనిచేశారు. ఇప్పటివరకు ఎంపీడీఓగా పనిచేసిన మురళీమోహన్‌కుమార్ సారవకోట బదిలీపై వెళ్లారు. ఈమె నియామకం పట్ల మండల పరిషత్ కార్యాలయం, సచివాలయం, ఎన్ఆర్ఈజీఎస్, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.



ఎంపీడీఓ పావని

**పాతపట్నం:** స్థానిక ఎంపీడీఓగా పి.చంద్రకుమారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె మెళియాపుట్టి ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేసిన పి.జయంత్ ప్రసాద్ సంతబొమ్మాళి ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. చంద్రకుమారికి ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, కార్యదర్శులు అభినందనలు తెలిపారు.



ఎంపీడీఓ చంద్రకుమారి

### పలు కుటుంబాలకు పరామర్శ

**ఆమదాలవలస:** మున్సిపాలిటీ పరిధిలో మెట్టక్కివలసకు చెందిన పొన్నాడ రామారావు అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ స్పీకర్, శ్రీకాకుళం జిల్లా పార్లమెంటరీ పరిశీలకులు తమ్మినేని సీతారాం గురువారం పరామర్శించారు. ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు తాతపూడి శ్రీను తల్లి ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, పార్టీ నాయకులు ఎ.విజయ్, యల్ల హేమంత్, రంజిత్, సతీష్ తదితరులు ఉన్నారు .



మెట్టక్కివలసలో రామారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న తమ్మినేని సీతారాం